ఏరులై పారుతున్న మద్యం

- ప్రజారోగ్యానికి తూట్లు
- జనావాసాల్లో మద్యం షాపులు
- పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు


మండపేటలోని గొల్లపుంతలో మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న స్థానికులు (ఫైల్)

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీ ప్రజారోగ్యానికి శాపంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం మద్యం వినియోగాన్ని పెంచి ప్రభుత్వానికి ఆదాయ వనరుగా భావిస్తూ ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాల శివారున మద్యం షాపులు పరిమిత సంఖ్యలో ఉండేవి. అది కూడా మద్యం వినియోగాన్ని సాధ్యమైనంత తగ్గించేందుకు ప్రభుత్వం ద్వారా నిబంధనలు అమలు చేస్తూ దుకాణాలు నిర్వహించేవారు.

నియోజకవర్గంలో మద్యం షాపులు

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 4, రామచంద్రపురం పట్టణంలో 6, రూరల్‌లో 4, కాజులూరులో 5 మొత్తం 19 షాపులు ఏర్పాటు చేశారు. మండపేట నియోజకవర్గంలో మండపేట పట్టణంలో 5, రూరల్‌లో 6, కపిలేశ్వరపురం మండలంలో 4, రాయవరం మండలంలో 4 మొత్తం 19 మద్యం షాపులు ఏర్పాటయ్యాయి. వాటిలో అనేకం జనావాసాల మధ్య ఏర్పాటు చేశారు.

కౌన్సిల్‌లో ఏకరువు పెట్టినా పట్టించుకోని వైనం

జనావాసాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు సమస్యలకు నిలయంగా మారాయి. నియోజకవర్గ కేంద్రమైన మండపేట పట్టణంలోని మద్యం షాపు నిర్వహణే అందుకు నిదర్శనం. మండపేట పట్టణంలో ల్యాండ్‌మార్క్ అయిన కలువపువ్వు సెంటర్ లోనే వేంకటేశ్వరస్వామి ఆలయం, మసీదు, మున్సిపల్ కార్యాలయం, టౌన్‌హాల్ ఉన్నాయి. భక్తులు, కార్యాలయ సందర్శకులతో నిత్యం ఈ ప్రాంతం సందడిగా ఉంటుంది. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చేవారితో ఈ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యతగల సెంటర్‌కు సమీపాన మద్యం షాపున ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే మహిళలు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు ఈ మద్యం షాపు మీదుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ సాధారణ జనంపైకి మందుబాబులు గొడవకు దిగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు ప్రజల పక్షాన నిలిచి ఫిర్యాదు చేసినా కూటమి ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు.

మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఆ దుకాణాన్ని పట్టణ శివారుకు తరలించాలంటూ గత మూడు కౌన్సిల్ సమావేశాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న నిర్వహించిన కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ముందుగా మద్యం షాపు తొలగింపు అంశాన్ని అజెండాలో చేర్చాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు కమిషనర్ టీవీ రంగారావుకు సూచించారు. ఆ విషయాన్ని కమిషనర్ విస్మరించారు. ఆ సమావేశంలో మద్యం షాపునకు అనుమతి ఇవ్వడంపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతోపాటు కౌన్సిలర్ల విజ్ఞప్తి మేరకు ఇప్పుడైనా షాపును మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ శివారుకు తరలించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 29న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మరో మారు మద్యం షాపు తరలింపు అంశంపై ఎమ్మెల్సీ తోట, సభ్యులు ప్రస్తావించారు. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ నెల 13న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో జనం సమస్య మీకు పట్టదా అంటూ మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్సీ తోట, కౌన్సిలర్లు మండిపడ్డారు. వారి కోరిక మేరకు అక్కడ ఉన్న మద్యం షాపును తొలగించకుండా అక్కడే మరో షాపును ఏర్పాటు చేయడం కూటమి పాలన తీరుకు కొసమెరుపు. అవస్థలు పడుతున్న ప్రజలను, సమస్యను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులను విస్మరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు తావిచ్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని పలువురు వాపోతున్నారు.


మండపేట మున్సిపల్ కార్యాలయ సమీపంలో జనావాసాల్లో మద్యం షాపు

తొలి నుంచీ ప్రజల్లో వ్యతిరేకత

రామచంద్రపురం మండలం వెల్ల గ్రామ శివారు వెల్లసావరం వెళ్లే రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును దూరంగా తరలించాలని 2024 నవంబర్ 1న మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సమీప గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు అదే రహదారిలో వెళ్తుంటారని మద్యం షాపు ఏర్పాటు చేయడంపై కన్నెర్ర చేశారు. మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డు జంక్షన్‌లో మద్యం దుకాణం తెరిచేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా నివాసాల చెంతన మద్యం దుకాణాలు వద్దంటూ ప్రజలు ఆందోళన చేశారు. ఇలా రెండు నియోజకవర్గాల్లోనూ మద్యం షాపుల ఏర్పాటుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల స్పందన శూన్యం.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

కూటమి ప్రభుత్వంలో మద్యం షాపులు ప్రైవేటు పరం కాగానే లాభమే పరమావధిగా బెల్ట్ షాపులకు తెరతీశారు. వాటి వద్ద అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగాయి. మద్యం మత్తులో కొందరు రహదారులపై వీరంగం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కపిలేశ్వరపురం మండలంలో సుమారుగా 10 బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. రాయవరం మండలంలో 20, మండపేట పట్టణంలో మూడు, రూరల్ మండలంలో 10 బెల్ట్ షాపులు నడుస్తున్నట్టు సమాచారం.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి అదుపు

మద్యం ఎంతగా పేదల కుటుంబాలను కుంగదీస్తున్నాయో బాధిత కుటుంబాల ద్వారా తెలుసుకున్న అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో మద్య నిషేధానికి ప్రాధాన్యతనిచ్చారు. ఐదేళ్లలో శాస్త్రీయ పద్ధతిలో దశల వారీగా మద్య నిషేధానికి తీవ్రమైన ప్రయత్నం చేశారు. అధికారంలోకి రాగానే ప్రైవేటు మద్యం షాపులను తొలగించి నిబంధనలు మేరకు పరిమిత సంఖ్యలో పట్టణ, గ్రామాల శివార్లలో ప్రభుత్వ షాపులను నడిపింది. గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేసింది. మద్యానికి బానిసలైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మద్యం మహమ్మారి నుంచి వారిని కాపాడేందుకు సాధ్యమైనంత వరకూ కృషి చేశారు. కూటమి పాలన అవేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ విచ్చలవిడి మద్య విక్రయ విధానాన్ని అమలు చేస్తోంది.

క్లుప్తంగా

రైతుల సహకారంతోనే కాలువల అభివృద్ధి


కోలంకలో డ్రోన్‌తో మందు పిచికారీని ప్రారంభిస్తున్న విజయగోపాలరాజు

కాజులూరు: రైతుల సహకారంతోనే కాలువల అభివృద్ధి సాధ్యమౌతుందని కోటిపల్లి సాగునీటి పంపిణీ సంఘాల అధ్యక్షుడు దాట్ల విజయగోపాలరాజు అన్నారు. సోమవారం కోటిపల్లి డివిజన్ పరిధిలోని కాజులూరు, కె.గంగవరం మండలంలోని పలు గ్రామాల్లోని డ్రైయిన్లు, పంటకాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు డ్రోన్ స్ప్రేయర్లతో మందుల పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. కోలంకలో ఆయన మాట్లాడుతూ రైతులు అనాలోచితంగా తమ పొలాల్లోని చెత్తా, చెదారం సమీపంలోని కాలువలు, డ్రైయిన్‌గట్లపై పారవేస్తున్నారన్నారు. అవి క్రమేపీ కాలువల్లో పడి నీటి ప్రవాహానికి అడ్డంకులుగా మారుతున్నాయన్నారు. గట్లపై చెత్తకుప్పలు వేసే విషయంలో రైతులు ఆలోచించి ఇరిగేషన్ అధికారులకు సహకరించాలన్నారు.

సంగీత సేవలు ప్రశంసనీయం


అంగరలో వృద్ధుడికి వస్త్రాలు అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం : రాష్ట్ర మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి సామాన్య ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమని సోమవారం నిర్వహించిన ఆయన 14వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అంగరలోని సంగిత వెంకటరెడ్డి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సంగిత స్వగ్రామం పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ పెద్దిరెడ్డి శేషారత్నం మాట్లాడుతూ వెంకటరెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. అనంతరం గ్రామంలోని పేదలకు వస్త్రాలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, మాజీ ఉప సర్పంచ్ మచ్చా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 9 అర్జీలు

రామచంద్రపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో మొత్తం 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో కార్యాలయ అధికారులు తెలిపారు. తల్లికి వందనం కోసం 2, రీసర్వే 2, భూమి తక్కువ చూపిస్తున్నారని 1, వ్యవసాయ భూమిలోకి మురుగునీరు వెళ్లకుండా చూడాలని 1, పంచాయతీకి కట్టిన డిపాజిట్ సొమ్ములు ఇప్పించాలని 1, రైతులకు దారి ఏర్పాటు చేయాలని, విద్యా హక్కు చట్టం అమలు చేయాలని, సర్వే హద్దులు చూపించాలని ఒక్కొక్కటి చొప్పున ఆర్డీవోకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

సోమేశ్వరస్వామికి ఘనంగా లక్షపత్రి పూజ


వెంటూరులో సోమేశ్వర స్వామికి అభిషేకం

రాయవరం: వెంటూరులో వేంచేసియున్న పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా లక్షపత్రి పూజ నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని తటవర్తి రామలింగేశ్వరరావు, చిట్టి దంపతుల సౌజన్యంతో లక్షపత్రి పూజలు చేశారు. తొలుతగా స్వామి వారికి మహన్యాస పూర్వకంగా ఏకాదశి రుద్రాభిషేకం చేశారు. పార్వతీదేవికి కుంకుమార్చన చేశారు.భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దువ్వూరి రామారావు, తటపర్తి రాఘవరాజు, బాలాంత్రపు మూర్తి, నందూరి వెంకట్రావు, గొట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడి మృతి


గరగ కామరాజు (ఫైల్)

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు గరగ కామరాజు(68) ఆకస్మికంగా మృతి చెందారు. పంచాయతీ వార్డు సభ్యుడిగా, నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కామరాజు వైఎస్సార్ సీపీలో చురుగ్గా వ్యవహరించేవారు. కామరాజుకు కుమారులు వెంకటేశ్వరరావు, సోమన్న, సతీష్ ఉన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కామరాజు కుమారులను ఫోన్‌లో పరామర్శించారు. సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, మాజీ సర్పంచ్ నాగదేవర సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, మాజీ సొసైటీ అధ్యక్షులు వైట్ల రాంబాబు, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, గరగ శ్రీనివాసు, గరగ సోమన్న, కామరాజు సోదరుడు గరగ సత్యనారాయణ తదితరులు కామరాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం


అమలాపురంలో నిరసన తెలుపుతున్న మండపేట నియోజకవర్గ యువకులు

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో విద్య, వైద్యం తదితర వ్యవస్థలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు చోడే సత్యకృష్ణ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, సహాయ కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్ తదితర నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం యువజన, ఇతర అనుబంధ విభాగాలు ఆధ్వర్యంలో ×యువత పోరు₹ పేరుతో చలో అమలాపురం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన విభాగం జిల్లా కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ పర్యవేక్షణలో మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్ మండలం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున అమలాపురం నిరసన కార్యక్రమానికి విద్యార్థి, యువకులు తరలివెళ్లారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ ఫీజులను చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన నిలబడుతూ యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల సుధాకర్, ఎంపీటీసీ పట్నాల నాగబాబు, విసుపురెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


రామచంద్రపురంలో శ్యాంప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

రామచంద్రపురం: డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు దునే శ్రీనివాసు ఆధ్వర్యంలో పట్టణంలో పలు పోలింగ్ బూత్‌ల వద్ద సోమవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నేతలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి శ్రీనివాసు, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణాల కళ్యాణ్, సీనియర్ నాయకులు కొట్టువాడ హరిబాబు, కుప్పెల సూర్యనారాయణ, రాఘవేంద్రరావు, కులపాకుల వెంకటరమణ, కొణపాల గణేష్, ముమ్మిడివరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశం కోసం ప్రాణాలు వదిలిన బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. దేశం ఒక్కటిగా ఉండాలని ఉమ్మడి పౌరస్మృతి కోసం తన ప్రాణాలను సైతం వదిలిన మహోన్నత వ్యక్తిగా శ్యాంప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తి కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో పాలెపు ఓం నమశ్శివాయ, బట్టా త్రిమూర్తులు, రావులరాజు, రాశింశెట్టి వీరబాబు, తలాటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుగ్గుదుర్రులో..

కాజులూరు: దేశానికి శ్యాంప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయంగా గుర్తుండిపోతాయని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం మండలంలోని 160 పోలింగ్‌బూత్‌లలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆలోచనలు శాస్త్రీయమైనవి

కపిలేశ్వరపురం (మండపేట): జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆలోచనలు శాస్త్రీయమైనవని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. మండపేటలో బీజేపీ 98వ పోలింగ్ బూత్ కమిటీ ఆధ్వర్యంలో ముఖర్జీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యుడు వల్లభనేని రవీంద్ర బాబు, జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థుల ఎంపిక


రమ్యనందు వీవీవీ వసుంధర పి.లోకేశ్వరరెడ్డి


నితిన్‌శంకరరెడ్డి నాగసునీత

రాయవరం: మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం సాపిరెడ్డి ముత్యాలరావు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాల నుంచి 75 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా, 71 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల నుంచి పీవీఎల్ రమ్యనందు 589 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. పీవీఎల్ రమ్యనందుతోపాటు 583 మార్కులు సాధించిన వీవీవీ వసుంధర, 580 మార్కులు సాధించిన పి.లోకేశ్వరరెడ్డి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. 580 మార్కులు సాధించిన ఎం.నితిన్‌శంకరరెడ్డి, ఎం.ఎస్.నాగసునీత ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికవ్వడంపై సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి పాఠశాల హెచ్‌ఎం ముత్యాలరావు, ఉపాధ్యాయులను అభినందించారు.

చలో కలెక్టరేట్‌కు తరలిన అంగన్‌వాడీలు



అమలాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న మండపేట నియోజకవర్గం అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వానికి సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని దీంతో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆందోళనకు పిలుపునిచ్చిందని అంగన్‌వాడీలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలన్న పిలుపును అందుకొని మండపేట నియోజకవర్గంలోని మండపేట, కపిలేశ్వరపురం మండలాల నుంచి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సోమవారం పెద్ద ఎత్తున అమలాపురం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఎన్నికల ముందు కూటమి నేతలు అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. చిరుద్యోగులైన అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తల్లికివందనం అర్హుల జాబితాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ వారి పిల్లలకు పథకం వర్తింపజేయలేదని పలువురు తెలిపారు. దీనిపై అంగన్‌వాడీలు ఐసీడీఎస్ పరిధిలోని ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలను అందజేసినా ఫలితం లేకపోవడంతో యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేయాలని నిర్ణయించినట్టు అంగన్‌వాడీలు తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాలు, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాలు, రాయవరంలోని 12 గ్రామాలు, మండపేటలోని 30 వార్డుల పరిధిలోని అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు తరలివెళ్లారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామచంద్రపురం: రాష్ట్రంలోని విద్యా రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో అడ్డగోలు ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతుల కొరతను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు ఆర్డీవో అఖిలప్రియకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనా, పాత, కొత్త ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.8 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉండటం, స్కాలర్‌షిప్‌లు జాప్యం కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, ఆహారం వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థుల స్థితిగతులు మరింత దయనీయంగా మారాయన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను విస్మరించి, విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటు రంగానికి వదిలేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు మూతపడుతుండగా, కార్పొరేట్ పాఠశాలలు లాభాల కోసం విద్యను విక్రయించడాన్ని నిర్బంధించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కూటమి ప్రభుత్వం విద్యను వాణిజ్యంగా మార్చే కుట్రలకు పాల్పడుతుందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు పటిష్టంగా కొనసాగాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ప్రారంభిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కె.నవీన్, సురేష్, ఎస్.సందీప్, కళ్యాణ్, పీవైఎల్ నాయకులు భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం


ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీరామ నామ సప్త సప్తాహం మూడో వారం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామికి ఉష్ట్ర వాహనంపై సోమవారం ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, సభ్యులు జోగా శ్రీను, సాక్షి పద్మనాభం, వాసంశెట్టి చిన్ని, వాసంశెట్టి చిన్నబాబు, నంగి బుజ్జి, బొక్కా భద్రరావు, కోలాటం బృందాలు, సతార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి పసుపు రంగు


పసుపు రంగులోకి మారిన మండపేట మున్సిపల్ కార్యాలయం

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వ పథకాలకు రాజకీయ నాయకుల పేర్లు తొలగిస్తాం. మహనీయుల పేర్లను పరిశీలిస్తాం, పార్టీలకు సంబంధించిన రంగులను ప్రభుత్వ భవనాలు, నిర్మాణాలకు వేయబోము అంటూ 2024 ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూటమి తరపున చెప్పిన మాటల సారాంశం. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు రంగులు వేస్తున్నారు. అన్నా క్యాంటీన్ భవనానికి పసుపు రంగు వేశారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలను పసుపుమయం చేస్తున్నారు. ఇటీవల మండపేట మున్సిపల్ కార్యాలయానికి పసుపు రంగు వేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీల రంగు వేయబోమన్న కూటమి నేతల మాట మండపేటలో చెల్లుబాటు కాకపోవడం చర్చనీయాంశమైనది.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

రాయవరం: మండలంలోని పసలపూడిలో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మాజీ సర్పంచ్ బొడబళ్ల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే కలకాలం నిలుస్తాయి


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలుకుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కె.గంగవరం: అంకితభావంతో బోధన చేసే ఉపాధ్యాయుల సేవలు విద్యార్థుల మనస్సుల్లో కలకాలం నిలుస్తాయని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు అన్నారు. మండలంలోని గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతూ సమావేశం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఎంవో రాంబాబు, ఎంఈవో ఎ.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా బోధన చేసే ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నటికీ మరువలేరన్నారు. వృత్తిపట్ల మక్కువతో పాఠశాలకు వన్నె తెచ్చే విధంగా బోధన చేసిన ఆప్‌కాస్ట్ జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ పీవీ బ్రహ్మానందం, ఉపాధ్యాయులు నందూరి భీమరాజు, కాకినాడ రమేష్, అయ్యంగారి లక్ష్మి, కలిదిండి మూర్తి సేవలను ప్రశంసించారు. బదిలీపై వెళ్లిన, పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు దుశ్శాలువా, జ్ఞాపిక, బహుమతితో ఘనంగా సత్కరించారు. పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రూ.10 వేలు విలువైన సీలింగ్ ఫ్యాన్లను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, జి.ఏడుకొండలు, వి.శ్రీధర్, రాఘవకుమారి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.